# వేచిన కెరటానికో చెలియలి కట్ట

**గరికపాటి కృష్ణమూర్తి**



సుధాకర్!

ఎంత మధురమైన పేరు మనోజ్ఞమైన రూపానికి తగ్గట్టుగా అమరింది. లోకాన్ని మత్తెక్కిస్తాడు. కన్నెపిల్లల మనసునకు మైకం కల్గిస్తా డీ సుధాకర్.

తెల్లటి దేహచ్ఛాయ, కొనతేలిన ముక్కు, వెడల్పు కళ్ళు, చక్కగా అమరిన మీసకట్టు, నొక్కులు తిరిగిన జుట్టు, విశాలమైన వక్షస్థలం.

ఒకసారి చూసినవారికి మళ్ళీ చూడా లనిపించే ముఖవర్చస్సు. ఎప్పుడూ నవ్వుతూ యెదుటివారిని నవ్వించే చూపులు.

ఒక వింత ఆకర్షణతో మెరుస్తున్న ఆ చూపుల్లో యేదో అయస్కాంత శక్తి ఉన్నది. ఆ ఆకర్షణశక్తి ముందు యెంతటి ఆత్మశక్తి సంపన్నులైనా బలహీనులై పోవాల్సిందే.

సుధాకర్ కి పెళ్ళయితే మాత్రమేం. ఇద్దరు పిల్లల తండ్రయితేనేం.

కొత్తగా చూసేవాళ్ళకి అసలు పెళ్ళయినవాడిలాగే కన్పించడు.

అతనేదో వ్యాపారం చేస్తున్నాడట. అదేదో పెద్దదయ్యే ఉంటుంది. లేక పోతే అంత ఖరీదైన బట్టలు వేసుకో లేడు. రూప మెంత సుందరమైందో, బట్టల్ని అంత అందంగా కుట్టించు కుంటాడు. గుడ్ టేస్ట్.

సుధాకర్ కి పెళ్ళికాకుండా ఉంటే యెంత బాగుండేది. తమ కులం కాక పోయినా ఫర్వాలేదు. పోట్లాడైనా సరే అంగీకరించకపోతే తమవారు తాము చూసుకునేవాళ్ళు...ప్చ్! ఇప్పుడేమను కొని యేం లాభం?

కాని అతనిని చూడనిదే ఉండలేక పోతుందే తను! ఆ రూపాన్ని తల్చు కుంటుంటూనే శరీరం గగుర్పాటు చెందు

తుంది. అతనిని గురించిన ఊహలే మనస్సునిండా ఝుమ్మంటున్నయ్.

సాయంత్రం యింటి కెళ్ళేటపుడు తను గేటు దగ్గరున్నది లేనిదీ చూస్తాడు. చిరునవ్వు నవ్వుతాడు. చిలిపి చూపులు విసురుతాడు.

తనంటే యిష్టమే లేకపోతే ఆ కవ్వింపులకు అర్థమేమిటి?

అప్పుడప్పుడూ తన మనసు నిగ్రహించుకోవాలనుకున్నా దానిని శాసించ లేకపోతుంది.

తనకు సుఖం, ఆనందం అతని సన్నిధిలో ఉన్నయ్యనిపిస్తుంది. ఏదో అనిర్వచనీయమైన మధురానుభవం, అనుభూతులు అతని కౌగిట్లో...

అసలు ఒక మధురానుభూతిగాని, ఒక ఎక్సైట్‌మెంట్‌గాని లేని జీవితం యేమిటి? అదొక నిస్సారమైన ఎడారే! లభించినదానిలో సంతృప్తిని ఎదుర్కో-వాలనేది బలహీనుల రాజీ సూత్రం. ఒకరకంగా ఆత్మవంచనకూడా. నిజా యితితో కూడిన జీవితం కాదు

* * *

ఉగ్రకాళిలా లక్ష్మి భర్తను కడిగే స్తుంది. చీదేస్తుంది.


"నమ్ము లక్ష్మీ!...ఏ ప్రమాణం చేయమంటే అది చేస్తాను. నే నే పాపమూ యెరగను." ప్రాధేయపడు తున్నాడతను.

"ఇంతపని చేస్తున్నవారు యే ప్రమాణాలు చేయరుగనుక! అవ్వ! పెళ్లై పుత్రుంగా కాపరం జేసుకుంటూ యివేమి బుద్ధులండీ? ఎవరన్నా వింటే నవ్వి పోతారు సిగ్గుచేటుకూడాను. ఒకరి నొకరు చూసుకోలేనిదే ఉండలేమన్నంత వరకూ వచ్చిన తర్వాత నేనిక్క-డెందు కండీ! ప్రేమలేఖలోనే అన్ని వయ్యారాలు పోయినావిద దేనికైనా తగుతుంది. రోజూ యెన్ని షికార్లు కొడుతున్నారో, యెక్క-డెక్క-డ ఊరేగుతున్నారో నేను చూస్తున్నానా యేమిటి? అమ్మో... అమ్మో ... బుద్ధిమంతుడు, ఉద్యోగం చేసుకుంటున్నాడని మా నాన్నంటే కాబోలనుకున్నా. శ్రీకృష్ణపరమాత్మలని తెలియదు," బిగ్గరగా అరవడం మొదలెటేంది.

లేదు. మా యింటికి పంపించేయండి. ఏ ఆడదీ యిటువంటి దారుణాన్ని చూస్తూ ఊరుకోలేదు. సహిస్తూ కాపరం చేయలేదు నన్ను యిప్పుడే పంపించే యండి. దానితోనే కులకండి."

పైగా అవతల యెవరన్నా వింటున్నా రేమోనని అభిమానం ముంచుకొస్తుంది.

"ఏం కొడతారా? కొట్టండి. మీ కా అధికారమే గాదు, అడ్డమైనవాళ్ళతో ప్రేమకలాపాలు జరిపే అధికారంకూడా




ఉన్నదని, దానిని కాదంటే కొట్టడానికి... ఆఖరికి చంపేయడానికికూడా అధికారాలున్నయ్యని యీనాడు ఋజువు చెయ్యండి. ఆ తర్వాత మీ యిష్టమొచ్చినట్లు వూరేగండి...ఊఁ! ఆగారేం..."

చీరచెంగుతో కన్నీళ్లు తుడుచుకొంది. ఎన్నేళ్ళనుండి జరుగుతుంతో యీ వాగోతం. ఈ రోజు ఆ ప్రియురాలు రాసిన ఉత్తరం నా పాపిష్టి కళ్లబడ్డది కాబట్టి కాని..."

తనకేమీ తెలియదని మాత్రమే మొత్తుకుంటున్నాడతను

స్వయాన పోస్టుమాన్ అందజేసినట్టు పోస్టు ముద్రల సాక్ష్యాధారం చూపిస్తుంది భార్య.

ముక్కుపుటాలు చీదేస్తూ మళ్ళీ అందుకొంటున్నది.

గాలివానను ఆగమని ప్రాధేయపడ్డా, ఆజ్ఞాపించినా ఆగదని నిశ్చయానికొచ్చాడు. తల పట్టుకొని కుర్చీలో కూలబడ్డాడు.

"మీకు బుద్ధి లేకపోతే లేకపోయింది. దానికెలా లేదాని. కనీ పెంచి పెద్ద చేసిన తల్లిదండ్రుల గౌరవాభిమానాలు యేమైపోతాయని చేసింది పని. సభ్యతా సంస్కారాలున్నవాళ్లు చేసే పనులేనా యివి? నీతి, జాతి గలవాళ్లకి తగినవేనా? కాస్త ఎర్రగా బుర్రగా ఉన్నాడని కనబడ్డ వాళ్ళవెంట పడటమేనా? ప్రేమట. ప్రేమ...సిగ్గులేకపోతే సరి ఆయన్ని కట్టుకొని ఆయనతోటే జీవితమనుకొనే పాటి ఆడది ఒకటుందన్న యింగిత జ్ఞానమన్నా లేకుండా పచ్చని సంసారంలో నిప్పులు పొయ్యటానికి తయా

రయింది నెరజాణ...హవ్వ...హవ్వ! మీకు పెళ్ళయినా పర్వాలేదుట. రెండో భార్యగా ఉండటానికైనా సిద్ధమేనట... ఎంత బరి తెగించింది...ఇదంతా తెలిస్తే దాన్నెవరైనా చేసుకుంటారాని..."

అతను లక్ష్మివంక కొరకొరా చూడటం మినహా యేమీ చేయలేక పోతున్నాడు. భార్య వాక్ప్రవాహము ఆగటంలేదు.

"రేపు దానికి మొగుడు దొరికి, ఆయన్నెవరైనా తన్నుకుపోవటానికి ప్రయత్నంచేస్తే తెలిసొస్తుంది అమ్మాయికి, ఆ బాధేమిటో! తన హక్కేమిటో!...అయినా ఇంకొకరి హక్కును తాను పొందటానికి ఎవరండీ అది?" ఛాలెంజి చేస్తూ నిలదీసి అడిగేస్తుంది.

భార్య యెప్పుడూ యింత ఉగ్ర రూపం దాల్చటం చూడలేదు.

ఇప్పుడేమి చెప్పినా వినదు. నమ్మదు.

ఎవరో ఒకరు తగ్గకపోతే గౌరవం నిలబడేటట్లులేదు. ఆమే తగ్గేటట్లులేదు. తన కా మార్గాంతరం కన్పించటం లేదు.

చివరికి గత్యంతరంలేక బయటి కెళ్ళిపోయాడు కోపంగా.

ఆఫీసునుండి వచ్చిన అన్నయ్యకు కాఫీ యిద్దామని కాఫీకప్పుతో వచ్చిన నీరజ తలుపు ప్రక్కన నిలబడి ఘర్షణంతా విన్నది. అన్నయ్య వెళ్ళిపోవటంతో తనూ వంటింట్లోకి దారితీసింది.

* * *

వారం రోజుల తర్వాతకూడా-

భర్త మీద ఆనాడు లేవనెత్తిన దుమారాన్ని తలచుకొని ముసిముసిగా నవ్వులు నవ్వుకుంటూనే ఉన్నది లక్ష్మి.

పులిలాంటి మనిషి పిల్లిలా హడలిపోయారు.

తను కల్పించి రాసిన ప్రేమలేఖ పీడనే ఆయన్ని హడలగొట్టినట్టుగాని, ఆఖరికి దస్తూరినికూడా గుర్తుపట్టకుండా జాగ్రత్తపడ్డట్లుగాని ఆయనకు తెలియనే తెలియదు పాపం!

ఈ రహస్యం, తను ఆడిన నాటకం ఆయనకు తెలియకూడదుకూడా!

ఆ రోజునుండి అనుకొన్న ఫలితం ఆడబిడ్డ నీరజలో కనపడసాగింది.

నీరజ యిప్పుడు గేటు దగ్గరకెళ్ళి ఎవరికోసమూ యెదురు చూడటంలేదు.

ఉవ్వెత్తున లేచి వచ్చిన కెరటం తీరాన్ని తాకి నిశ్చలపోయి నట్లుంది నీరజ యిప్పుడు.

